

అనంతలో పూల మాలలతో నిండిన వాల్మీకి విగ్రహం



ఇష్టం.. కష్టంతో ఏదైనా సాధ్యం

మహర్షి వాల్మీకి జీవితం దీనికి నిదర్శనం

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, జేసీ, నాయకులు

అనంతపురం క్రైం, క్లాక్‌టవర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఇష్టం, కష్టంతో మనిషి ఏదైనా సాధించవచ్చునని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. మహర్షి వాల్మీకి జీవితమే అందుకు ఉదాహరణ అని అన్నారు. ఆయన అందించిన రామాయణం మానవ జీవన మార్గదర్శి అని కొనియాడారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జేసీ శివనారాయణ శర్మ తదితరులతో కలిసి వాల్మీకి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వాల్మీకి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని అన్నారు. చరిత్రలో, పురాణాల్లో మనం చదువుకుంటున్న మహనీయుల గాథలను మరోసారి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మానవుడు మారగలడు అనే దానికి వాల్మీకి మహర్షిని మించిన ఉదాహరణ లేదని అన్నారు. వేటతో జీవించే పరిస్థితుల నుంచి రామాయణాన్ని రచించి మహనీయుడుగా మారడం అద్భుతమని అన్నారు. వాల్మీకులు, బోయల అభివృద్ధికి టీడీపీ ఎంతగానో కృషి చేస్తోందని అన్నారు. వారికి ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు, కార్పొరేషన్‌ల చైర్మన్, డైరెక్టర్ పోస్టులను ఇచ్చి, రాజ్యాధికారంలో విస్తృతంగా భాగస్వాములను చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, ఆర్డీఓ కేశవనాయుడు, బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూ కొఠారి, డీపీఓ నాగరాజునాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, పార్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ చిరంజీవిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, మాజీ మేయర్ స్వరూప, టీడీపీ నాయకులు ఆదినారాయణ, అక్కులప్ప, పరమేష్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా..

వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. రాయదుర్గంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వాల్మీకి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. గుంతకల్లులో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ తదితరులు వేడుకలలో పాల్గొన్నారు. తాడిపత్రి, పెద్దవడుగూరులో జరిగిన వేడుకలలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి పాల్గొన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అనంతపురంలోని తమ క్యాంపు కార్యాలయాలలో వాల్మీకి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.



రాయదుర్గంలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, నాయకులు



పెద్దవడుగూరులో నివాళులు అర్పిస్తున్న తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి



పాత గుంతకల్లులోని వాల్మీకి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు



అనంతలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ...



నివాళులు అర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్, మేయర్ తదితరులు



అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వెంకటరమణా.. గోవిందా..

తాడిపత్రి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రసిద్ధి చెందిన చింతల వెంకటరమణస్వామి రథోత్సవం మంగళవారం వైభవోపేతంగా సాగింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత చింతల వెంకటరమణుడి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, రథంపై కొలువుదీర్చారు. వేలాదిగా హాజరైన భక్తుల గోవింద నామ స్మరణ నడుమ స్వామివారి రథం కదిలింది. ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి భక్తులతో కలిసి, రథాన్ని లాగి ప్రారంభించారు. మెయిన్ బజారు, శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహం వరకు రథోత్సవం నిర్వహించారు.

కన్నులపండువగా కల్యాణోత్సవం

ఉదయాన్నే చింతల వెంకటరమణుడి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణం నిర్వహించారు.



భక్త జన సందోహం మధ్య సాగుతున్న రథోత్సవం

భూ సమస్యలు పరిష్కరించాలి

సోలార్ ప్రాజెక్టుపై సమీక్షలో కలెక్టర్ ఆనంద్



అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం భూ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోలార్ ప్రాజెక్టు కోసం భూ సేకరణపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కంబదూరు మండలంలోని చెన్నంపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్రాజెక్టు కోసం 5862 ఎకరాల భూమిని గుర్తించగా, ఇందులో నెలకొన్న భూ సమస్యల ను నెల రోజుల్లో పరిష్కరించాలన్నారు. ఆర్డీఓ, సోలార్ ప్రాజెక్టు, నెడ్ క్యాప్, సర్వే శాఖల అధికారులతో టీంను ఏర్పాటు చేసుకుని రెండు రోజుల్లోగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో జేసీ శివనారాయణ శర్మ, కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంత బాబు, కలెక్టరేట్ ఈసెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, సర్వే ఏడీ రూప్లానాయక్, ఏపీఎన్‌జీఈఎల్ డెవలప్‌మెంట్ అధికారి కిషోర్‌రెడ్డి, ఎల్డీఎం నరేష్‌రెడ్డి, ఎన్‌టీపీసీ అధికారులు శివకుమార్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పీడీ సస్పెన్షన్

- శిశుమరణాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం (6లో..)

అనంతలో రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడాపోటీలు

నవంబరు 7న ప్రారంభం.. ఏర్పాట్లు చేయండి: కలెక్టర్ (6లో...)

ఉద్యోగాల పేరుతో కోట్ల వసూలు

- హైదరాబాద్‌లో ప్రైవేట్ కంపెనీ పెట్టిన గొడ్డుమర్రివాసి
- యల్లనూరులో కేసు నమోదు చేసిన పోలీసులు (వివరాలు మెయిన్‌లో...)

ఎన్నేళ్లో వేచిన ఉదయం

- నేడు గ్రేడ్-5 కార్యదర్శులకు ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్
- ఏళ్ల తరువాత ప్రమోషన్లపై ఆనందం

(6లో...)

జిల్లాకు చేరిన యూరియా

అనంతపురం అర్బన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : జిల్లాకు స్పిక్ కంపెనీకి చెందిన 988.87 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద వ్యాగిన్లలో వచ్చిన యూరియా బస్తాలను మంగళవారం ఆయన పరిశీలించారు. జేసీ ఆదేశాల మేరకు ఏపీ మార్క్‌ఫెడ్‌కు 649.98, ప్రైవేటు డీలర్లు, 338.89 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసినట్లు వివరించారు.

పశు వైద్యాధికారి పైసల వేట..! 6

ఆటో డ్రైవర్ల సంబరం

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



పాలతో అభిషేకం చేస్తున్న నారాయణస్వామి

అనంతపురం క్రైం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం కింద రూ.15 వేల ఆర్థిక సాయం అందించడంతో నగరంలో సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల కార్పొరేషన్ చైర్మన్ గడిపూటి నారాయణస్వామి ఆధ్వర్యంలో దివ్యాంగులైన ఆటో డ్రైవర్లు ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి సప్తగిరి సర్కిల్ వరకూ మంగళవారం ర్యాలీ చేశారు. ఎన్టీఆర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జిల్లా నాయకులు బ్రహ్మ, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు నాగూరు హుస్సేన్, నాయకులు మాబు, కృష్ణగోపాల్, చంద్ర, శ్రీకృష్ణ, అశోక్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఏటా ఇంతే..!

వర్షాభావం, తెగుళ్లతో ఎండిపోతున్న వేరుశనగ

- కుప్పలు అవుతున్న పెట్టుబడి అప్పులు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న అన్నదాతలు



కుందుర్పి మండలం కరిగానపల్లిలో ఎండిపోయిన వేరుశనగ పంట

మడకశిర/కుందుర్పి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వర్షాభావం, తెగుళ్లతో ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంట ఎండిపోతోంది. ఎన్నో ఆశలతో వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంట కళ్లెదుటే ఎండిపోతుంటే రైతులు విలవిల్లాడిపోతున్నారు. ఎకరాకు రూ.30వేల దాకా పెట్టుబడి పెట్టామని, వర్షాభావం, చీడపీడలతో పంట మొత్తం నష్టపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందస్తుగా వేరుశనగ సాగు చేసిన రైతులు ప్రస్తుతం వేరుశనగ పంట తొలగిస్తున్నారు. చెట్టుకు 10నుంచి 12కాయలు ఉన్నాయని, అవి కూడా నాణ్యతగా లేవని రైతులు వాపోతున్నారు. పంట సక్రమంగా పండితే ఎకరాకు ఏడు క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చే అవకాశం ఉందని, ప్రస్తుతం అందులో సగం కూడా వచ్చే పరిస్థితి లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా ఇదే పరిస్థితి ఉండటంతో కోలుకోలేక ఇబ్బంది పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు.

అగ్గి తెగులుతో ఇబ్బంది

వేరుశనగను అగ్గి తెగులు పీడిస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మడకశిర నియోజకవర్గంలో వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణంగా 28 వేల హెక్టార్లు కాగా వర్షాభావంతో 11 వేల హెక్టార్లలోనే సాగైంది. ఈ ఏడాది భారీగా పెట్టుబడులు పెరిగాయని, అందుకు

(మిగతా 6లో..)

వాల్మీకి సర్కిల్ అభివృద్ధికి కృషి

రూ.50లక్షల సొంత నిధులతో పనులు

లోకేశ్‌తో వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరింపజేస్తాం

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



వాల్మీకి సర్కిల్‌లో వాల్మీకి చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): సొంత నిధులు రూ.50 లక్షలతో పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పట్టణంలోని వాల్మీకి సర్కిల్ వద్ద వాల్మీకి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వాల్మీకి జయంతి వేడుకలను ప్రభుత్వం తరఫున నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. వాల్మీకి సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేస్తామన్నారు. వాల్మీకి సర్కిల్‌ను వాణిజ్య సముదాయంగా మార్చేందుకు కృషి చేస్తామన్నారు. అందరి సమన్వయంతో పట్టణాన్ని అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారుస్తామన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయండి

ప్రతి మండల కేంద్రంలోను దివ్యాంగులకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి, ఉచిత ఉపకరణాలను పంపిణీ చేయాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచించారు. పట్టణంలోని కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో దివ్యాంగ పిల్లలకు మంగళవారం ఉచితంగా ఉపకరణాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు, పింఛన్లు, పరికరాలు అందించి వారిని ఆదుకోవాలన్నారు. కాగా పట్టణంలోని వడ్డెకాలనీలో నిర్వహించిన తుమ్మల మారెమ్మ జాతరలో ఎమ్మెల్యే అమిలినేని కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు.

నేటి నుంచి రెండో విడత పీజీ అడ్మిషన్లు

అనంతపురం రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో రెండో విడత పీజీ అడ్మిషన్ల ప్రక్రియ బుధవారం ప్రారంభం అవనున్నట్లు అడ్మిషన్ల సంచాలకుడు ప్రొఫెసర్ నరసింహన్ తెలిపారు. మొదటి విడత ప్రక్రియ గతనెల 27న ముగిసింది. తొలివిడతలో ఆర్ట్సులో 56 మంది, సైన్స్‌లో 157 మంది, మొత్తం 213మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. ఇప్పటికే ఏటా అడ్మిషన్లు తగ్గుతున్నాయన్న వాదనలు ఆయావర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియపై ఆసక్తి నెలకొంది.

చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ మంగళవారం సీజనల్ చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జ్ కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.12వేల పలికాయని వివరించారు. మార్కెట్‌కు మొత్తంగా 82 టన్నుల చీనీ కాయలు వచ్చాయని పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.22

అనంతపురం రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో మంగళవారం టమోటాలు కిలో రూ.22తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.10, సరాసరి ధర రూ.17తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,250 టన్నుల టమోటాల వచ్చినట్లు పేర్కొన్నారు.



ఉల్లికంటిపల్లి ముఖచిత్రం

నిలిచిపోయిన అంగన్‌వాడీ కేంద్రం

నయాపైసా రాలేదు



మా ఊర్లో 136 ఇళ్లకు పురావాసం కింద డబ్బులు వస్తాయని గ్రామానికి వచ్చిన రాజకీయ నాయకులు చెప్పడం తప్ప ఇంత వరకు నయాపైసా ఇచ్చింది లేదు. డబ్బులు రాకపోవడంతో చేసేది ఏమిలేక ఇళ్ల కట్టుకున్నాం. గ్రామంలో ఎక్కడా మౌలిక సదుపాయలు లేవు. ప్రభుత్వం నుంచి అభివృద్ధి పనులు రావడంలేదు.

-మోటసాని గంగమ్మ, ఉల్లికంటిపల్లి

ఎన్నేళ్లీ కన్నీళ్లు..!

'చాగల్లు' ముంపులో ఉల్లికంటిపల్లి

- నేటికీ అందని పునరావాస ప్యాకేజీ
- 13 ఏళ్లుగా నిరీక్షిస్తున్న గ్రామస్థులు

శింగనమల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పునరావాస సాయం కోసం మండలంలోని ఉల్లికంటిపల్లి ప్రజలు 13ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వాలు మారినా తమ సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామ సమీపంలో చాగల్లు రిజర్వాయర్ నిర్మించడంతో ఊరు మొత్తం ముంపునకు గురవుతోంది. దీంతో ప్రజలు ఇళ్లు, పొలాలు కోల్పోయారు. అప్పటి ప్రభుత్వం పునరావాసం కింద గ్రామంలోని 150 కుటుంబాలకు నష్టపరిహారం అందజేసింది. పునరావాసం కింద 136 కుటుంబాలకు గ్రామానికి సమీపంలో 5 సెంట్లు చెప్పున ఇంటిస్థలాలు ఇచ్చారు. ఆర్‌ఆర్ చట్టం-2013 ప్రకారం రావాల్సిన ఇంటి నష్టపరిహారం, రోడ్డు, బడి, గుడి తదితర మౌలిక సదుపాయాలు ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో కల్పించలేదు. అయితే మండలంలో ఏ ఎన్నికలు వచ్చినా రాజకీయ నాయకులకు ఉల్లికంటిపల్లి సమస్య మాత్రం ప్రచారాస్త్రంగా మారుతోంది. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో మాజీ ఎమ్మెల్యేలు సాకే శైలజానాథ్, యామినీబాల, జొన్నలగడ్డ పద్మావతి వరకు బాధితులకు హామీ ఇచ్చారు. నేటికీ పరిహారం మాత్రం ఇవ్వలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా ఉన్న తమ సమస్యకు కూటమి ప్రభుత్వమైనా పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇంటికి రూ.10 లక్షలు ఇవ్వాలి

పునరావాస ప్యాకేజీ కింద ఇంటికి రూ.7లక్షలు ఇస్తామని అప్పట్లో అధికారులు తెలిపారు. 136 ఇళ్లకు గ్రామంలో మౌలిక సదుపాయాల కోసం రూ.9.5 కోట్లు అంచనా వేశారు. అయితే ఇంతవరకు నయా పైస రాలేదని గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుత ధరల ప్రకారం ఇంటికి రూ.10 లక్షలు ప్యాకేజీ ఇవ్వాలని కోరుతున్నారు. ప్యాకేజీ విషయం ప్రభుత్వం నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



సీసీ రోడ్డులేని ఉల్లికంటిపల్లి

సీఎం దృష్టికి తీసుకెళ్లా



ఉల్లికంటిపల్లి గ్రామానికి పునరావాస ప్యాకేజీ విషయంలో పలు సార్లు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకు వెళ్లా. పునరావాసం ప్యాకేజీ వివరాలను ఇప్పటికే ఇచ్చాం. ఉల్లికంటిపల్లి గ్రామ ప్రజలకు సీఎం న్యాయం చేస్తాడనే నమ్మకం, భరోసా ఉన్నాయి.

-బండారు శ్రావణిశ్రీ, ఎమ్మెల్యే, శింగనమల

లోకేశ్ హామీతో...

మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర ఉల్లికంటిపల్లి గ్రామం మీదగా సాగినప్పుడు గ్రామస్థులు అందరు ఆయన్ను కలిసి పునరావాస ప్యాకేజీపై వినతి పత్రం ఇచ్చారు. దాదాపు అరగంటసేపు గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించిన లోకేశ్ తాము అధికారంలోకి రాగానే పునరావాసం ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చారు. మంత్రి లోకేశ్‌పై తమకు నమ్మకం ఉందని, తమ సమస్య తప్పకుండా పరిష్కారం అవుతుందని వారు చెబుతున్నారు. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు సైతం వందశాతం ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చారని, తప్పకుండా నెరవేరుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉల్లికంటిపల్లి వాసులు (ఫైల్)

గుడి, బడికి స్థలం ఇవ్వలేదు



మా గ్రామనికి సంబంధించి కొండ ప్రాంతంలో 13ఏళ్ల కిందట ఒక్కో ఇంటికి ఐదు సెంట్లు స్థలాన్ని ఇచ్చారు. అయితే బడి, గుడికి మాత్రం స్థలం ఇవ్వలేదు. ఎలాగూ బడి లేదు. కనీసం గుడి కావాలని కొండలో మేమే చందాలు వేసుకుని అమ్మవారిని పెట్టి పూజలు చేస్తున్నాం.

-మైలా రవిశంకర్, ఉల్లికంటిపల్లి

ఐసీడీఎస్ పీడీ సస్పెన్షన్

- శిశుగృహాలో శిశువు మరణాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం

అనంతపురం వైద్యం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): శిశుగృహలో ఓ శిశువు మృతికి ఐసీడీఎస్ పీడీ ఎం.నాగమణిని బాధ్యులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వేటు వేసింది. మూడు నెలలపాటు సస్పెన్షన్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఎవరినీ ఇన్‌చార్జ్ పీడీగా నియమించలేదు. సస్పెండ్ అయిన నాగమణి కార్యాలయంలోనే ఉండాలని, ఉన్నతాధికారుల ముందస్తు అనుమతిలేకుండా వెళ్లకూడదని కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 3న విరేచనాల కారణంగానే శిశువు మృతిచెందినట్లు నివేదికలో చూపారని ఉత్తర్వుల్లో వివరించారు.

తరువాత ఎవరో..?

శిశువు మృతి కారణాలపై త్రిసభ్య సంఘం నుంచి మాతా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌తో పాటు జిల్లా న్యాయసేవ అధికార సంస్థ వరకు ఎవరి స్థాయిలో వారు విచారణ నిర్వహించారు. పలుకోణాల్లో అధికారులు, సిబ్బందిని ప్రశ్నించారు. శిశుగృహ కేంద్రం మేనేజర్, ఆయాలు, సోషల్ వర్కర్, నర్స్, వాచ్‌మన్ నుంచి పర్యవేక్షణ అధికారులైన డీసీఎం, పీడీ వరకు ఆది, సోమవారాల్లో విడివిగా విచారించారు. అదేవిధంగా మంగళవారం జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ప్రభుత్వ సర్వజన వైద్యశాలకెళ్లి పీడియాట్రిక్స్ విభాగం డాక్టర్లు, సూపరింటెండెంట్‌ను కలిసి శిశువు ఆరోగ్య వివరాలను సేకరించారు. శిశువు మృతిచెందకముందు అనారోగ్య కారణాలతో శిశుకేంద్రం నుంచి ఎన్నిసార్లు ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఏఏ అనారోగ్య కారణాలతో శిశువు ఇబ్బందిపడ్డారు. మృతిచెందిన రోజు ఎలా ఉన్నారు వంటి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన కొన్నిగంటలకే పీడీపై వేటు పడింది. అయితే ఇంకా ఎవరెవరిపై భవిష్యత్తులో వేటు పడనుందోనని చర్చ సాగుతోంది.



ఐసీడీఎస్ పీడీ నాగమణి

పశు వైద్యాధికారి

పైసల వేట..!

- ప్రతి పనికీ కాసులిచ్చుకోవాల్సిందే
- ఆవేదన వ్యక్తం చేస్తున్న పాడి రైతులు



అనంతపురం రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ పశువైద్యాధికారి పైసలిస్తేనే పని చేస్తారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పశువులకు ఆరోగ్య పత్రం ఇవ్వాలన్నా.. చనిపోయిన వాటికి పోస్టుమార్టం చేయాలన్నా కాసులు ఇచ్చుకోవాల్సిందేనట. రైతులు మాట్లాడితే దురుసుగా వ్యవహరిస్తారని తెలుస్తోంది. ఆ శాఖలోని ఓ ఉన్నతాధికారి అండతోనే రెచ్చిపోతున్నట్లు చర్చ సాగుతోంది.

తేదీ వేసేందుకు రూ.వెయ్యి..

పాడి రైతుల సహాయార్థం కేంద్ర ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డు అందిస్తోంది. ఆ కార్డు ఉన్న రైతులకు బ్యాంకుల్లో 4 శాతం వడ్డీతో రుణాలు ఇస్తారు. ఇందుకు పశువైద్యాధికారులు హెల్త్ సర్టిఫికెట్ (ఆరోగ్య పత్రం) ఇవ్వాల్సి ఉంటుంది. సర్టిఫికెట్‌లో పాడి పశువులకు ఉన్న ఇన్సూరెన్స్ ట్యాగ్‌ల ఆధారంగా ఏ జాతి ఆవు, వయసు, ఎన్ని లీటర్లు పాలు ఇస్తుంది, రంగు తదితర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. మండలంలోని పది గ్రామాలకుపైగా సదరు పశువైద్యాధికారి పరిధిలోకి వస్తాయి. ప్రతి సంతకానికి ఓ రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పాడి పశువుల సంఖ్యకు అనుగుణంగా రూ.వెయ్యి మొదలుకుని, రూ.5వేల వరకు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతు రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. రెండు వారాల కిందట ఆ రైతు నుంచి సదరు వైద్యాధికారి సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.3,500 తీసుకున్నారట. ఆ సర్టిఫికెట్‌లో తేదీ లేదని బ్యాంకు అధికారులు చెప్పడంతో రైతు తిరిగి వైద్యాధికారి వద్దకెళ్లాడు. మార్పు చేసి ఇచ్చినందుకు మరో రూ.వెయ్యి పుచ్చుకున్నట్లు తెలుస్తోంది. పశువుల పోస్టుమార్టంలో కూడా వసూళ్లకు పాల్పడుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. పశువుల మందుల విషయంలో కూడా బయట కొనుగోలుకే ప్రాధాన్యం ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగం సాధించిన అనతి కాలంలోనే ఈ అధికారి వసూళ్ల వేటలో పడినట్లు తెలుస్తోంది.

రైతులతో దురుసు ప్రవర్తన

పశువైద్యాధికారి వసూళ్ల వేటలోనే కాదు.. వ్యక్తిగతంగానూ దూకుడుగా వ్యవహరిస్తూ రైతుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ శాఖ ఉన్నతాధికారి అండతోనే చెలరేగిపోతున్నట్లు తెలుస్తోంది. రైతులు మాట్లాడితే.. 'ఉన్నతాధికారితో మాట్లాడతావా.. మీరు ఫోన్ చేస్తారా.. నన్ను చేయమంటారా..' అంటూ ఆస్పత్రికి వచ్చిన వారితో దురుసుగా మాట్లాడతారని రైతులు అంటున్నారు. ప్రస్తుతం కూడా మరో ఉన్నతాధికారి.. వసూళ్ల సారుకి వత్తాసు పలుకుతూ, వెనకేసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ఆ అధికారి మరింత పేట్రేగిపోతున్నట్లు గ్రామాల్లో చర్చ సాగుతోంది. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలోనూ పలువురు ప్రజాప్రతినిధులు.. ఆ అధికారి తీరుపై ఫిర్యాదు చేశారు.

పంచాయతీ సిబ్బందికి నేటి నుంచి శిక్షణ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గ్రామ పంచాయతీల్లో ఆదాయ వనరులు సమకూర్చుకోవడంపై సిబ్బందికి బుధవారం నుంచి మూడు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఒక పంచాయతీ కార్యదర్శి చొప్పున మొత్తం 63 మంది హాజరు కావాలన్నారు. స్థానిక ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో కార్యక్రమానికి ఏర్పాట్లు చేశామని ఆయన వివరించారు.

ఏటా ఇంతే..!

(5వ పేజీ తరువాయి)

తగ్గ దిగుబడులు మాత్రం రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీంతో మరింత అప్పుల్లో కూరుకుపోవడం ఖాయమని చెబుతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం కుందుర్పి మండల వ్యాప్తంగా 6 వేల హెక్టార్లకు పైబడి వేరుశనగ సాగు చేశారు. పదును వానలేక పంటంతా ఎండిపోతోంది. కుందుర్పి బ్రాంచ్ కెనాల్ ద్వారా చెరువులకు నీరు వస్తే కనీసం బోరు బావుల ద్వారానైనా పంటలు పండించుకుంటామని మండల రైతులు చెబుతున్నారు. ఈ సారి బలమైన వర్షం కురవకపోవడంతో ఇప్పటికే పశువుల మేత కూడా కరువైపోయి, తాగేందుకు చుక్కనీరు కూడా అటవీ ప్రాంతంలో దొరకడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి కుందుర్పి కాలువకు నీళ్లు వదిలి, పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

అప్పులు తీరుతాయనుకుంటే..



పిల్లల చదువుల కోసం చేసిన అప్పులు తీరుతాయనే ఆశతో ఖరీఫ్‌లో వేరుశనగ పంటను సాగు చేశా. 8 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేసినా పంట ఏ మాత్రం చేతికి అందడం లేదు. సుమారు రూ. 2 లక్షలు పైబడి ఖర్చు పెట్టా. పెట్టుబడి కూడా చేతికందే పరిస్థితి లేదు. మాలాంటి రైతులు గట్టెక్కే పరిస్థితి కనిపించడం లేదు.

-మహేశ్, వేరుశనగ రైతు, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

సాగునీరు అందిస్తేనే..



బీటీపీ నుంచి కుందుర్పి బ్రాంచ్ కెనాల్ ద్వారా చెరువులకు నీరు అందిస్తేనే కుందుర్పి ప్రాంత రైతులు బాగుపడతారు. వర్షానికి వేసిన వేరుశనగ పంటంతా నిట్టనిలువునా ఎండిపోతోంది. బోరు బావుల్లో కూడా నీటి మట్టం తగ్గింది. వర్షధార పంటలు నమ్ముకోలేక మాకున్న 5 ఎకరాల్లో బోరుబావుల కింద పండ్లమొక్కలు సాగు చేశా. వాటికి కూడా నీరందించడం కష్టం అవుతోంది.

-హరిదాసులు, రైతు, కుందుర్పి

అనంతలో రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడాపోటీలు

నవంబరు 7న ప్రారంభం.. ఏర్పాట్లు చేయండి: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలకు అనంత వేదిక కానుంది. జిల్లాలో నవంబరు 7, 8, 9 తేదీల్లో ఉత్సవాలు నిర్వహించనున్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఉత్సవాల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ ఆనంద్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చే ఉద్యోగుల కోసం అన్ని వసతులు కల్పించాలన్నారు. ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... రెవెన్యూ క్రీడల ప్రారంభోత్సవానికి రాష్ట్ర ఉన్నతాధికారులు వచ్చే అవకాశం ఉన్నందున పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. సమావేశంలో డీఆర్వో మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ రామకృష్ణారెడ్డి, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట రాజేష్, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, డీఎంహెచ్ఓ ఈబీ దేవి పాల్గొన్నారు.



సమావేశంలో బొప్పరాజు వెంకటేశ్వర్లుతో కలిసి మాట్లాడుతున్న కలెక్టర్

ఎన్నేళ్లో వేచిన ఉదయం

నేడు గ్రేడ్-5 కార్యదర్శులకు ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

ఏళ్ల తరువాత ప్రమోషన్లపై హర్షం

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు ఏళ్లుగా ఉద్యోగోన్నతులకు నోచుకోలేదు. వారి గురించి పట్టించుకునే వారు లేరు. అలాంటివారి మోములో కూటమి ప్రభుత్వం ఆనందం నింపింది. ఉద్యోగోన్నతులు కల్పిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని 155 మంది గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్ 4గా ఉద్యోగోన్నతి కల్పించనున్నారు. అందుకు సంబంధించిన కౌన్సెలింగ్ బుధవారం అనంతపురంలోని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) కార్యాలయంలో చేపట్టనున్నారు. ఏళ్లుగా ఉద్యోగోన్నతులు కల్పించక తీవ్ర నిరాశలో ఉన్న పంచాయతీ కార్యదర్శులకు అవకాశం కల్పిస్తుండడంలో వారి ఆనందానికి అవధుల్లేవు.



డీపీఓ కార్యాలయం

అందరికీ ఆనందం

పంచాయతీ కార్యదర్శుల ప్రమోషన్ కలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోంది. ఈ ఏడాదిలో వరుసగా ఉద్యోగోన్నతులు కల్పిస్తోంది. తొలుత 10 మంది సీనియర్ గ్రేడ్-1 కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పించి, కమిషనర్ కార్యాలయానికి ఏసీఆర్ పంపారు. ఆ మేరకు స్థానిక అధికారులు ప్లేస్‌మెంట్స్ కేటాయించారు. దీంతో గ్రేడ్-2 కార్యదర్శులకు గ్రేడ్-1గా ఉద్యోగోన్నతి కల్పించడానికి మార్గం సుగమమైంది. డిప్యూటీ ఎంపీడీఓలుగా వెళ్లిన వారి స్థానాల్లో 10 మంది గ్రేడ్-2 కార్యదర్శులకు ఉద్యోగోన్నతి కల్పించారు. అప్పటికే ఖాళీగా ఉన్న వాటితోపాటు, ఉద్యోగోన్నతుల ద్వారా ఖాళీ అయిన వాటిని కలుపుకుని 44 మందికి గ్రేడ్-3 కార్యదర్శులకు గ్రేడ్-2గా ఉద్యోగోన్నతి కల్పించారు. గ్రేడ్-4 కార్యదర్శుల బాధలు అన్నీ ఇన్నీ కావు. పదేళ్లుగా ప్రమోషన్ లేక ఉద్యోగంపైనే పలువురిలో ఆసక్తి సన్నగిల్లింది. ఈ పరిస్థితుల్లో వారి ఉద్యోగోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ మేరకు 46 మందికి గ్రేడ్-4 నుంచి గ్రేడ్-3 కార్యదర్శులుగా ప్రమోషన్ కల్పించారు. పంచాయతీ వ్యవస్థ నాలుగు గ్రేడ్స్ వరకే ఉండేది. గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను అమలు చేయడంలో భాగంగా గ్రేడ్-5, గ్రేడ్-6 కార్యదర్శులను నియమించింది. దీంతో ఇప్పటికే గ్రేడ్-4 కార్యదర్శులకు సంబంధించి ఖాళీగా ఉన్న స్థానాలతోపాటు ప్రమోషన్ల ద్వారా ఖాళీ అయిన వాటిని కలుపుకుని ఏకంగా 155 మంది గ్రేడ్-5 కార్యదర్శులకు గ్రేడ్-4గా ఉద్యోగోన్నతి కల్పించనున్నారు. ఆ మేరకు జాబితా కూడా రూపొందించారు. బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక డీపీఓలో ఉమ్మడి జిల్లాలోని డీపీఓలు, డీఎల్‌పీఓలు కౌన్సెలింగ్ నిర్వహించి, ఉద్యోగోన్నతుల ప్రక్రియ చేపట్టనున్నారు. నేల రోజుల్లోపే గ్రేడ్-6 కార్యదర్శులకు గ్రేడ్-5గా ఉద్యోగోన్నతులు కల్పించనున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. సచివాలయ వ్యవస్థపై పలు అనుమానాలతో ఉన్న సిబ్బందికి సైతం ఉద్యోగోన్నతుల ప్రక్రియ చేపట్టడం ద్వారా భరోసా ఇచ్చినట్లయిందని ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రేడ్-1 కార్యదర్శుల నుంచి డిప్యూటీ ఎంపీడీఓల ఉద్యోగోన్నతులకు సంబంధించి రేండో జాబితా దాదాపు 30 మందితో ఇప్పటికే సిద్ధం చేశారు. వారంలోపే వారికి కూడా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

కొనేవారేరీ?

వారంలోనే పడిపోయిన ధర

ఆందోళనలో మొక్కజొన్న రైతులు



మార్కెట్ యార్డులో మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబోసిన రైతులు

ఉరవకొండ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధరలేక మొక్కజొన్న రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల వ్యవధిలోనే ధరలు అమాంతం పడిపోయాయి. నాణ్యతలేదని పేచీ పెడుతుండటంతో వ్యాపారులు చెప్పిన రేటుకు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఉరవకొండ డివిజన్‌లో 1326 హెక్టార్లలో మొక్క జొన్న సాగు చేశారు. ఉరవకొండలో 490, వజ్రకరూరులో 653, విడపనకల్లులో 185, గుంతకల్లులో 645హెక్టార్లలో మొక్కజొన్నను సాగు చేశారు. ప్రస్తుతం క్వింటా రూ.2వేలకు మించి ధర పలకడం లేదు. గత ఏడాది ఇదే సమయంలో క్వింటా రూ.2600కు పైగా ఉండేది. ఈ ఏడాది ఆరంభంలో కూడా ధర బాగానే ఉన్నా వారం రోజుల వ్యవధిలోనే పూర్తిగా తగ్గిపోయింది. పంట దిగుబడి ఆశాజనకంగా ఉన్నా కొనే వారు లేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మొక్కజొన్న ధాన్యం తడిసి రంగు మారిందన్నారు. ఎకరాకు రూ.40వేల దాకా పెట్టుబడి పెట్టామని, క్వింటా రూ.2వేలు ధర ఉంటే పెట్టుబడి కూడా రాదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట బాగా పండితే ఎకరాకు 15 క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందని వారు తెలిపారు. ధరలు ఇలాగే కొనసాగితే నష్టము, అప్పులే మిగులుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కనీస మద్దతు ధరను ప్రకటించాలన్నారు.

ఎదురు చూస్తున్నాం



పది రోజుల నుంచి మార్కెట్ యార్డులో మొక్కజొన్న గింజలను రాశులు పోసుకుని, కొనేవారి కోసం ఎదురు చూస్తున్నాం. నాలుగు ఎకరాల్లో మొక్క జొన్న పంటను సాగు చేశాం. ఇటీవల కురిసిన వర్షాలకు పంట తడిసి, దెబ్బతింది. వ్యాపారులకు అమ్ముదామనుకుంటే అడిగేవారు లేరు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

- రాజశేఖర్, రైతు, లత్తవరం

అడిగేవారు లేరు



వారం రోజులు వ్యవధిలోనే ధరలు పూర్తిగా పడిపోయాయి. అమ్ముకుందామంటే కొనేవారులేరు. మిర్చి పంట సాగు చేసి నష్టపోయామని, పంట మార్పిడి చేసి మొక్కజొన్న సాగు చేస్తే ఈ సారి నష్టలు తప్పడం లేదు. 2 ఎకరాల్లో పంటను సాగు చేశా. 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కొనే వారి కోసం ఎదురుచూస్తున్నాం.

- ఎర్రిస్వామి, రైతు, ఉరవకొండ

పోలీసులకు సవాల్..!

వరుస చోరీలతో బెంబేలెత్తిస్తున్న దొంగలు

తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్

గస్తీ, నిఘా పెంచాలంటున్న ప్రజలు




ధర్మవరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వరుసగా జరుగుతున్న చోరీలు పోలీసులకు సవాల్‌గా మారాయి. తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగలు కొల్లగొడుతున్నారు. దేవుడంటే ఏమాత్రం భయం లేకుండా ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. పట్టణంలోనే కాదు మండల కేంద్రాల్లో సైతం పట్టపగలే చోరీలకు పాల్పడుతున్నారు. నగలు, డబ్బుతో పాటు ద్విచక్ర వాహనాలను సైతం ఎత్తుకెళ్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా చోరీలు జరుగుతుండటంతో ప్రజలు ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లాలంటేనే హడలిపోతున్నారు.



నాయీ బ్రాహ్మణ కాలనీలో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ముదిగుబ్బ సీఐ (ఫైల్)

తగ్గిన నిఘా?

దొంగలు రెక్కీ నిర్వహించి చోరీలకు పాల్పడుతుండటం పోలీసులకు సవాలుగా మారింది. రాత్రుళ్లు పోలీసుల గస్తీ లేకపోవడం, పాత నేరస్తులపై నిఘా తగ్గడం, నిర్లక్ష్య ధోరణి వల్ల దొంగలు వరుస దొంగతనాలతో చెలరేగిపోతున్నారు. పోలీసు శాఖ అమలు చేస్తున్న లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం అటకెక్కింది. పోలీసులు సైరన్ లేని వాహనాల్లో తిరుగుతుండటంతో దొంగలు నిర్భయంగా తమ పని కానిచ్చేస్తున్నారు. దొంగతనాలు జరిగినా సొమ్ము రికవరీ చేయడంలో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు వినవస్తున్నాయి.



ముదిగుబ్బలోని బూదలమ్మ దేవాలయంలో పగులగొట్టిన హుండీ (ఫైల్)

మచ్చుకు కొన్ని..

- గత నెల 8న ముదిగుబ్బ మండలం బూదనాంపల్లి గ్రామంలో బూదలమ్మ ఆలయంలో హుండీ పగలగొట్టి, అందులోని సొమ్ము ఎత్తుకెళ్లడంతో పాటూ సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు.
- గత నెల 17న ముదిగుబ్బలోని సాయినగర్‌లో జాకీర్ హుస్సేన్ ఇంటిలో పట్టపగలే బీరువా పగలగొట్టి 8 తులాల బంగారం చోరీ చేశారు.
- గత నెల 24న అర్ధరాత్రి సమయంలో ధర్మవరం శివారు లక్ష్మీచెన్నకేశవపురంలో గీతమ్మ ఇంట్లో బీరువా పగులగొట్టి రూ.10 లక్షల నగదు, తులం బంగారం చేశారు.
- గత నెల 28న ముదిగుబ్బలోని నాయీ బ్రాహ్మణ కాలనీలో రమణమ్మ ఇంట్లో అర్ధరాత్రి దొంగలు బీరువా పగులగొట్టి 6 తులాల బంగారం చోరీ చేశారు.

గస్తీ, నిఘా పెంచాలి



మండలంలో వరుసగా చోరీలు జరుగుతున్నాయి. రాత్రివేళల్లో పోలీసు గస్తీ, నిఘా పెంచాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. గతంలో రాత్రి వేళల్లో సైరన్ ఉన్న వాహనంలో తిరుగుతూ పోలీసులు గస్తీ కాసేవారు. ఇప్పుడు అలాంటివి ఏవీ కనిపించడం లేదు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి గస్తీని ముమ్మరం చేయాలి.

-చల్లా శ్రీనివాసులు, సీపీఐ మండల కార్యదర్శి, ముదిగుబ్బ

నిఘా పెట్టాం : హేమంత్ కుమార్, డీఎస్పీ, ధర్మవరం



ఇటీవల కాలంలో జరుగుతున్న చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచాం. నియోజకవర్గంలో రాత్రి సమయాల్లో దేవాలయాల వద్ద గస్తీ నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించాం. రాత్రి సమయాల్లో అనుమానితులుగా ఉన్నవారిని ఎక్కడ ఉన్నారన్నదానిపై విచారణ చేస్తున్నాం. ముదిగుబ్బ, పట్నం, బత్తలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫింగర్‌ప్రింట్స్ డివైజర్స్ ఉన్నాయి. వాటి ద్వారా అనుమానితులను తనిఖీ చేస్తున్నాం. ఎల్‌హెచ్ఎంఎస్‌ను కూడా వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాం.

కృష్ణా, గోదావరి షట్లర్ల హవా

ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలతో ఎమ్మెల్యే అమిలినేని, అసోసియేషన్ సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-17 బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో కృష్ణా, గోదావరి జిల్లాల షట్లర్ల హవా కొనసాగింది. స్థానిక నాయక్‌నగర్‌లో మూడు రోజులపాటు సాగిన పోటీలు మంగళవారం ముగిశాయి. బాలుర సింగిల్స్‌లో శ్రీకర్ వెంకట్ ప్రణీత్ (తూర్పుగోదావరి) చాంపియన్‌గా అవతరించాడు. బాలికల సింగిల్స్‌లో కె గగనశ్రీ చౌదరి (కృష్ణా) విజేతగా నిలిచింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో బోను అభిషేక్ (తూర్పుగోదావరి), కె గగన శ్రీ చౌదరి (కృష్ణా) ద్వయం ట్రోఫీని సొంతం చేసుకుంది. బాలికల డబుల్స్‌లో మోక్షజ్ఞ చెపెనా (శ్రీకాకుళం), రుత్వికా ఈదల (పశ్చిమ గోదావరి) గెలుపొందారు. బాలుర డబుల్స్‌లో బోను అభిషేక్ (తూర్పుగోదావరి), శ్రీకర్ వెంకట్ ప్రణీత్ (తూర్పుగోదావరి) జోడీ విజేతగా ఆవిర్భవించింది. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సింగిల్స్ విజేతలకు చెరో రూ.10వేలు చొప్పున నగదు ప్రోత్సాహకం అందజేశారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బుగ్గయ్యచౌదరి, జయకుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్వ్యూలు

అనంతపురం అర్బన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ శిక్షణ కోసం బుధవారం నుంచి ఈనెల 11 దాకా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శైలజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం నగర శివారు పంగల్ రోడ్డు సమీపంలోని టీటీడీసీ కేంద్రంలో సీడాప్ ఆధ్వర్యంలో జరిగే ఇంటర్వ్యూలకు నిరుద్యోగ యువతి, యువకులు హాజరుకావాలన్నారు. ఇంటర్ లేదా డిగ్రీ పూర్తి చేయడంతోపాటు 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన నిరుద్యోగ యువతి, యువకులు అర్హులన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి 90 రోజులపాటు శిక్షణతోపాటు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత సర్టిఫికెట్‌తోపాటు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

అగ్నికి ఆహుతైన చీనీ తోట

500 చెట్లు దగ్ధం.. రూ.10 లక్షల నష్టం



కాలిపోయిన చీనీ చెట్లు



రైతు సురేష్

గార్లదిన్నె, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో చీనీ తోటకు నిప్పు అంటుకుని 500 చెట్లు కాలిపోయాయి. దీంతో దాదాపు రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన రైతు సురేష్ చీనీచెట్లు సాగు చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. 3 ఎకరాలలో డ్రిప్ సౌకర్యంతో ఐదు వందల చీనీచెట్లు సాగు చేశాడు. ఎనిమిదేళ్ల వయసున్న చెట్లు ప్రస్తుతం మంచి కాపు దశలో ఉన్నాయి. బోరుబావికి సరఫరా అయ్యే విద్యుత్ వైరు వైపు చెట్టు కొమ్మలు విరిగి పడటంతో విద్యుత్ తీగలు తెగి షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించి తోటలోని డ్రిప్ వైర్లు, పైపులు, చీనీచెట్లు పూర్తిగా కాలిపోయాయి. చీనీతోటలో మంటలు వ్యాపిస్తున్న విషయం తెలుసుకున్న తోటి రైతులు బాధిత రైతు సురేష్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన హుటాహుటిన తోట వద్దకు చేరుకుని, బంధువులు, తోటి రైతుల సాయంతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే చీనీ తోట, డ్రిప్ పైపులు పూర్తిగా కాలిపోయాయి. ఎంతో శ్రమించి కాపాడుకుంటున్న చీనీ చెట్లు కళ్లముందే బుగ్గి అవుతున్నా కాపాడుకోలేక ఆ రైతు బోరున విలపించాడు.

జిల్లాకు ఇద్దరు సీపీఓలు

విధుల్లో చేరిన శారద, ప్రభాకర్



శారద



ప్రభాకర్

అనంతపురం వైద్యం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఇద్దరు చీఫ్ ఫార్మసీ ఆఫీసర్(సీపీఓ)లను ప్రభుత్వం నియమించింది. వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో తాజాగా నిర్వహించిన ఉద్యోగోన్నతుల్లో భాగంగా శారద, ప్రభాకర్‌ను జిల్లాకు కేటాయించారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ప్రభాకర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు శారదను నియమించారు. సర్వజన వైద్యశాలతోపాటు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు సంబంధించిన ఫార్మసీని ప్రభాకర్ పర్యవేక్షిస్తారు. డీఎంహెచ్ఓ పరిధిలోని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల ఫార్మసీని శారద పర్యవేక్షిస్తారు. కడప స్విమ్స్‌నుంచి శారద, తిరుపతి రుయా నుంచి ప్రభాకర్ వచ్చారు. గత ఆరేళ్లలో ఫార్మసీ విభాగంలో అనేక అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త సీపీఓలైనా పారదర్శకంగా ప్రక్రియ కొనసాగిస్తారా.. అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

జిల్లా జైలు ఏఎస్పీగా వేణుగోపాల్ రెడ్డి

చిత్తూరు సిటీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ డి.వేణుగోపాల్‌రెడ్డికి అనంతపురం జిల్లా జైలు అడిషనల్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా జైలు సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన జిల్లా అథ్లెటిక్స్ జట్టు



టేబుల్ టెన్నిస్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ జిల్లా అథ్లెటిక్స్, టేబుల్ టెన్నిస్ జట్లను మంగళవారం ఎంపిక చేశారు. స్థానిక ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 బాల, బాలికల అథ్లెటిక్స్, అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు నిర్వహించారు. అథ్లెటిక్స్‌లో ఆయా విభాగాల్లో 40 మంది, టేబుల్ టెన్నిస్ అండర్-14, 17, 19 బాల, బాలికల విభాగాల్లో 38 మందిని ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, గోపాల్ రెడ్డి, ప్రభాకర్, నరసింహారెడ్డి, కోచ్‌లు పాల్గొన్నారు.

డీఎంహెచ్ఓగా డాక్టర్ యుగంధర్

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారికి ఉద్యోగోన్నతి



డాక్టర్ యుగంధర్

అనంతపురం వైద్యం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో ఇమ్యునైజేషన్ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ యుగంధర్‌కు ఉద్యోగోన్నతి లభించింది. కృష్ణాజిల్లా మచిలీపట్నం డీఎంహెచ్ఓగా ప్రమోషన్‌పై నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ, ఇన్‌చార్జి డీఎంహెచ్ఓగా ఆయన పనిచేశారు. ఉద్యోగోన్నతి పొందిన ఆయనకు పలువురు డాక్టర్లు, అధికారులు అభినందనలు తెలిపారు.

నీటిశుద్ధి కేంద్రం తనిఖీ



నీటి శుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆడిట్ సిబ్బంది

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనలో ఉన్న ఏజీ ఆడిట్ బృందం మంగళవారం తాడిపత్రి మండలంలోని బాలప్పకోన నీటిశుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేసింది. నీటి శుద్ధి ప్రక్రియకు సంబంధించి సంబంధిత డీఈ రామభూపాల్‌రెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు అప్పగించనున్నట్లు బృందం సభ్యుడు చంద్రదీప్ సింగ్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ మహేష్‌బాబు, కాంట్రాక్టర్ హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వరల్డ్ కప్ మ్యాచ్‌లకు స్కోరర్‌గా తాడిపత్రి వాసి



వినయ్

తాడిపత్రి, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈనెల 9నుంచి 26వతేదీ వరకు నిర్వహించే ఐసీసీ మహిళల క్రికెట్ వరల్డ్‌కప్ క్రికెట్ మ్యాచ్‌లకు తాడిపత్రికి చెందిన బిందెల వినయ్ స్కోరర్‌గా ఎంపికయ్యాడని తాడిపత్రి క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ సాదిక్‌వలి మంగళవారం ప్రకటనలో తెలిపారు. వినయ్ తాడిపత్రి నుంచి మొదటిసారిగా వరల్డ్‌కప్ క్రికెట్ మ్యాచ్‌కు స్కోరర్‌గా ఎంపికవడం హర్షణీయమన్నారు. గతంలో వినయ్ తాడిపత్రి ఆర్డీటీ సబ్‌సెంటర్ తరఫున క్రికెట్ ఆడారు. అనంతపురం తరఫున అండర్-16, 19 విభాగాల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఆరేడేళ్లుగా అంపైర్‌గా, స్కోరర్‌గా రాణిస్తున్నారు. వినయ్ ప్రస్తుతం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌లో స్కోరర్‌గా సేవలు అందిస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థిని



సంధ్య

ఆత్మకూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీ విద్యార్థిని సంధ్య రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ఎస్ఓ లీమారోస్ మంగళవారం తెలిపారు. జిల్లాకేంద్రంలో నిర్వహించిన నిర్వహించిన ఎంపిక పోటీల్లో హైజంప్ విభాగంలో విజేతగా నిలిచిన సంధ్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. సంధ్యను అభినందించారు.

ఎస్ఐ మందలించాడని ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

సోమందేపల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్ఐ మందలించాడన్న మనస్తాపంతో మండలంలోని వెలగమాకులపల్లి తండాకు చెందిన అశ్వత్థనాయక్ మంగళవారం ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం హిందూపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అశ్వత్థనాయక్ ప్రస్తుతం చెన్నేకొత్తపల్లిలో ఉపాధిహామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అశ్వత్థనాయక్ భార్య గతనెల 11వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేయకపోవడంతో బాధితుడు ప్రజాపరిష్కార వేదికలో డీఎస్పీ నరసింగప్పను కలిసి ఫిర్యాదు చేశాడు. దీంతో తనపైనే ఫిర్యాదు చేస్తావా అంటూ ఎస్ఐ రమేష్ తనను బెదిరించాడని బాధితుడు వాపోయాడు. స్టేషన్‌కు వెళ్లిన తనపై దాడి చేయడంతోపాటు దూషించాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్వగ్రామానికి చేరుకుని, విషద్రావకం తాగాడు. ఈ విషయమై ఎస్ఐ రమేష్‌ను వివరణ కోరగా.. భార్యాభర్తల మధ్య గొడవలు ఉన్నాయనీ, ఈ నేపథ్యంలో ఆమె ఇది వరకే ఇంటినుంచి వెళ్లిపోగా తీసుకొచ్చి, సర్దిచెప్పి అతడితో పంపామన్నారు. ప్రస్తుతం ఆమె డబ్బు, నగలతో వెళ్లిపోయిందని తెలియడంతో ఆమె కోసం గాలిస్తున్నామన్నారు. అశ్వత్థనాయక్ పోలీసు స్టేషన్‌కు వచ్చి తమ పనితీరును తప్పుపట్టడంతో మందలించానన్నారు. ఆత్మహత్యకు యత్నించడంపై అతడిపై కేసు నమోదు చేశామన్నారు.

నేడు ఉద్యానశాఖ జేడీ రాక

గార్లదిన్నె, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఉద్యానశాఖ జాయింట్ డైరెక్టర్ దేవమునిరెడ్డి బుధవారం గార్లదిన్నె మండలానికి వస్తున్నట్లు ఆ శాఖ అధికారి రత్నకుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. చీనీతోటల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సోకిన తెగుళ్లపై రైతులతో చర్చిస్తారని పేర్కొన్నారు. ఆయనతో పాటు తిరుపతి జిల్లా నుంచి సైంటిస్ట్ శ్రీనివాస్‌రెడ్డి కూడా వస్తున్నట్లు తెలిపారు. చీనీరైతులు రైతుసేవా కేంద్రాల వద్దకు రావాలని కోరారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు మంగళకర విద్యార్థిని



ఎంపికైన విద్యార్థిని ప్రణవి

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మంగళకర పాఠశాల విద్యార్థిని 2026లో ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ పెరేడ్‌కు ఎంపికైనట్లు మంగళకర విద్యాసంస్థల చైర్మన్ సురేష్‌కుమార్ తెలిపారు. మంగళకర పాఠశాలలో తొమ్మిదో తరగతి చదివే ప్రణవి ఇంటర్ బెటాలియన్ కాంపిటీషన్‌లో ఉమ్మడి జిల్లా నుంచి సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎంపికైనట్లు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్వహించే ఆర్‌డీసీ శిక్షణ శిబిరానికి వెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళకర ప్రిన్సిపాల్ బిందుజ, ఏఎన్ఓ మహమ్మద్‌మన్సూర్ తదితరులు విద్యార్థినిని అభినందించారు.

అభివృద్ధికి సహకరించండి

అధికారులతో ఎమ్మెల్యేలు శ్రావణిశ్రీ, ఎమ్మెస్ రాజు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు బండారు శ్రావణిశ్రీ, ఎమ్మెస్ రాజు

శింగనమల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలంకరాయునిపేట అభివృద్ధికి మండల స్థాయి అధికారుల సహకారం అవసరమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. గ్రామంలో మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఇంటి వద్ద ఆయనతో కలిసి అభివృద్ధి పనులపై అధికారులతో బండారు శ్రావణిశ్రీ సమీక్షించారు. ఎమ్మెల్యే శ్రావణిశ్రీ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఒక సామాన్యుడిగా వచ్చి నిధులు ఇవ్వమని జిల్లా కలెక్టర్, నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనకు అర్జీ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెస్ రాజు, మండల, జిల్లా అధికారుల సహకారంతో అలంకరాయనిపేటను మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ మా గ్రామంలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సహకారంతో ముందుకెళ్తామన్నారు. ఇప్పటికే విడుదల చేసిన నిధులతో గ్రామంలో రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. ఇంకా గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి, మండల అధికారుల సహకారంతో పరిష్కరిస్తామన్నారు. అనంతరం గ్రామంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పర్యటించారు. రూ.60 లక్షల ప్రత్యేక నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం భూమి పూజ చేయనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ విజయ్‌కుమార్, డీఈ కృష్ణజ్యోతి, ఏఈలు రవీంద్రరెడ్డి, విజయ్‌కుమార్, నామాల శ్రీనివాసులు, ఎంఈఓ శివప్రసాద్, ఏపీఓ భాగ్యలక్ష్మి, దామోదర్, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

గంగదేవిపల్లిలో శ్రీసత్యసాయి జిల్లా బృందం



గంగదేవిపల్లిని సందర్శించిన ఏపీ బృందం

గీసుగొండ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిని శ్రీ సత్యసాయి జిల్లా బృందం సందర్శించింది. బత్తలపల్లి, ధర్మవరం, ముదిగుబ్బ, కొత్తచెరువు మండలాల పరిధిలోని 7 గ్రామాలకు చెందిన 45 మంది కమ్యూనిటీ డెవలప్‌మెంట్ లీడర్‌లు ఆర్డీటీ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, ప్రజల భాగస్వామ్యం, సాధించిన జాతీయస్థాయి అవార్డుల గురించి జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో బాలవికాస సంస్థ ప్రతినిధి కొట్టె రమాదేవి, ధనలక్ష్మి, హనుమంతప్ప, సంజీవరెడ్డి, పద్మావతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

దాడి కేసులో నిందితుడి అరెస్ట్

అనంతపురం క్రైం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రానికి చెందిన కేశన్నపై దాడి చేసిన ఘటనలో నిందితుడు సుబ్బారావును వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నగర శివారులోని వనమిత్ర పార్కు వద్ద వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది అరెస్టు చేశారు. సీఐ తెలిపిన మేరకు.. బుక్కరాయసముద్రానికి చెందిన కేశన్నపై గత నెల 30న ఆయన అల్లుడు సుబ్బారావు కొడవలితో దాడి చేశాడు. విచారణ చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి పిడి బాకు స్వాధీనం చేసుకున్నారు.

ఇరువర్గాల ఘర్షణ
టీడీపీ సానుభూతిపరుడికి తీవ్రగాయాలు

రామగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రామగిరిలో మంగళవారం సాయంత్రం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. వాల్మీకి జయంతి వేడుకల సందర్భంగా వైసీపీ వర్గీయుడైన కృష్ణకిశోర్, టీడీపీ వర్గీయుడు దినేశ్‌ను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేశాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. పెద్దలు ఇరువురికి సర్దిచెప్పి పంపగా.. ఇంటికి వద్దకు వెళ్లి మళ్లీ గొడవ పడ్డారు. వెనుక నుంచి వచ్చిన కృష్ణకిశోర్ దినేశ్‌పై దాడిచేశారు. దినేశ్ పెదవిని కృష్ణకిశోర్ కొరికేశాడు. దినేశ్‌ను అనంతపురంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వీరిద్దరు అక్కచెల్లెళ్ల కుమారులే. ముందు నుంచి వర్గాలుగా ఉన్నట్టు తెలిసింది. పోలీసులు గొడవ గురించి ఆరాతీశారు. కృష్ణకిశోర్ పరారీలో ఉన్నట్టు తెలిసింది.

డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

అనంతపురం వైద్యం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబీ దేవి వైద్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మంగళవారం బుక్కరాయసముద్రం అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. విధుల్లోని ఫార్మసీ ఆఫీసర్ మహబూబ్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు, సిబ్బంది నారాయణనాయక్, విజయలక్ష్మి నుంచి వివరాలు తెలుసుకున్నారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. జిల్లా వైద్యకేంద్రాల్లో పనిచేస్తున్న డాక్టర్లు సమ్మెలో ఉన్నారన్నారు. వైద్యసేవలకు ఆటంకంలేకుండా మెడికల్ కాలేజ్, డీసీహెచ్ఎస్ పరిధిలోని డాక్టర్లు విధుల్లో పెట్టామన్నారు. రోగులకు సమస్యల్లేకుండా సేవలందించాలని సూచించారు.

బుక్ కీపింగ్‌పై అవగాహన పెంచుకోవాలి

అనంతపురం అర్బన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): 'మన డబ్బులు - మన లెక్కలు'కు సంబంధించిన మొబైల్ బుక్ కీపింగ్‌పై అవగాహన పెంచుకోవాలని డీఆర్‌డీఏ ఏపీడీ రాధారాణి సూచించారు. మంగళవారం స్థానిక టీటీడీసీ కేంద్రంలో ఎంపీఎంలు, ఎల్‌సీ, సీసీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొబైల్ యాప్‌లో వివరాలు ఎలా నమోదు చేయాలి, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ డీపీఎం సత్యనారాయణ, ఐబీ డీపీఎం రాజ్యలక్ష్మి, ఏపీఎం భాస్కర్‌నాయుడు, ఉన్నతి ఏపీఎం మంజుల తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి చర్యలు

అనంతపురం అర్బన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల పరిధిలో ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల సంఘాల వివరాలను సేకరించి, నివేదికలు ఇవ్వాలన్నారు. పథకాల వర్తింపులో రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రాధాన్యతనివ్వాలన్నారు.

18 నుంచి జేవీవీ చెకుముకి సంబరాలు

అనంతపురం టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ నుంచి పాఠశాల స్థాయి చెకుముకి సంబరాలు నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్‌బాబు వెల్లడించారు. మంగళవారం ఆయన చాంబర్‌లో చెకుముకి సంబరాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత 35 సంవత్సరాలుగా తెలుగు రాష్ట్రాల విద్యార్థులచే ప్రతి ఏడాది చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూళ్ల విద్యార్థులు విరివిగా పాల్గొని తమ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరరాజు, నాయకులు రమణయ్య, కోటేశ్వరప్ప, తిరుపాల్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేడుకగా మహర్షి వాల్మీకి జయంతి

పలు ప్రాంతాల్లో ఘనంగా నివాళి


వాల్మీకి చిత్రపటానికి అనంత ఎమ్మెల్యే కార్యాలయంలో నాయకులు.. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, గార్లదిన్నెలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ నివాళి అర్పిస్తున్న దృశ్యాలు

అనంతపురం క్రైం, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం నగరంలోని పలు కార్యాలయాల్లో వేడుకగా చేశారు. ఆయన చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు తలారి ఆదినారాయణ, స్వప్న, పరమేశ్వర్, పీఎల్ఎన్ మూర్తి, కడియాల కొండన్న, కోనంకి గంగారామ్, సుధాకర్ నాయుడు, లలిత్ కుమార్, లక్ష్మీనరసింహ, సుధాకర్ యాదవ్, సరిపూటి రమణ, తేజస్విని, పల్లవి, బాలకృష్ణ, నారాయణస్వామి, మణిరవి, నరేంద్ర చౌదరి, నాగరాజు పాల్గొన్నారు.

● అనంతపురంలోని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాంపుకార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ధర్మవరపు బాలాజీ, పేరం హరి, లక్ష్మీనారాయణ, సాకే బ్రహ్మ, సన్నప్పయ్య, శంకర, బాలకృష్ణ, రామలింగయ్య, వెంకటేషులు, కుళ్లాయప్ప, ఆదినారాయణ, వెంకటరాముడు, నరేష్, మహేష్, బొమ్మయ్య, హరీష్, శ్రీదేవి, నాగరాజు పాల్గొన్నారు. రాప్తాడులో ఎమ్మెల్యే పరిటాల సునీత వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

● శింగనమల: అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పూల మాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు, నాయకులు ఆదినారాయణ, తిప్పన్న, అనిల్, జీసీబాబు, బాలరంగయ్య పాల్గొన్నారు.

● గార్లదిన్నె : వాల్మీకి జయంతి వేడుకలను అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రామాంజి, వెంకటేష్, సూరి, రాము, వీరనారప్ప, రఘురాముడు, రవి, పరమేష్, గోవిందు పాల్గొన్నారు.

● శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, రెక్టార్ వెంకటనాయుడు, ప్రిన్సిపాల్ ఆంజనేయులు, కర్నూలు ప్రభుత్వ ఉన్నత విద్య అధ్యయన సంస్థ తెలుగు ఉపన్యాసకురాలు పార్వతీదేవి, ఆకాశవాణి వాఖ్యాత శ్యామసుందరశాస్త్రి, ప్రొఫెసర్లు జీవీ రమణ, మునినారాయణప్ప పాల్గొన్నారు.

● జేఎన్‌టీయూఏలోని పరిపాలన భవనంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌చాన్స్‌లర్ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణయ్య, దేవన్న, భానుమూర్తి, సుజాత, వైశాలి, నాగప్రసాద్‌నాయుడు, సత్యనారాయణ, సుబ్బారెడ్డి, పద్మసువర్ణ పాల్గొన్నారు.


వాల్మీకి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు


జేఎన్‌టీయూలో నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, సిబ్బంది

● అనంతపురంరూరల్ : వాల్మీకి జయంతిని పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ బోయ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ మణి రవి నివాళులర్పించారు. పాతవూరు పవర్ ఆఫీస్ సమీపంలోని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● రామగిరి : మండలంలోని శ్రీహరిపురంలో వాల్మీకి విగ్రహానికిపూలమాల వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య మాట్లాడుతూ.. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు.


ఎస్కేయూలో రిజిస్ట్రార్, రెక్టార్, సిబ్బంది.. శ్రీహరిపురంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, పాతూరులో మణిరవి ఆధ్వర్యంలో వాల్మీకి విగ్రహానికి నివాళులు

సీజేఐపై దాడి యత్నం హేయం


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీఎల్ఎఫ్ నాయకులు

అనంతపురం క్రైం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నం చేయడం హేయమని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) నాయకులు మండిపడ్డారు. మంగళవారం నగరంలోని జిల్లా కోర్టు వద్ద ఐలు నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి వెంకటరాముడు, స్పోర్ట్స్ సెక్రెటరీ విజయభాస్కర్, ఐలు అధ్యక్షుడు వీరమానప్ప, ప్రధాన కార్యదర్శి సతీష్ మాట్లాడుతూ.. ప్రధాన న్యాయమూర్తికే రక్షణ లేకుంటే...ఇక ప్రజలకు ఏమి రక్షణ ఉంటుందన్నారు. ఈ దాడి యత్నంతో యావత్తు దేశం ఆందోళనకు గురైందన్నారు. ఇది భారత రాజ్యాంగంపై దాడిగా భావించాల్సి వస్తుందన్నారు. న్యాయ వ్యవస్థపైన, న్యాయమూర్తులపైన దాడి చేయడం సిగ్గుచేటన్నారు. దాడికి ముక్తకంఠంతో ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, ప్రకాష్, పురుషోత్తం, అశోక్, గిరీష్, లక్ష్మీష్, భరత్, నాగేంద్ర పాల్గొన్నారు.

● అనంతపురం వైద్యం: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించడం దారుణమని బహుజన లాయర్ల ఫోరం(బీఎల్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప మండిపడ్డారు. ఈ ఘటనకు పాల్పడిన లాయర్ రాకేష్ కిశోర్‌ను కఠినంగా శిక్షించాలని బీఎల్ఎఫ్ ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్సీ, ఎస్టీ జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ వద్ద నిరసన వ్యక్తంచేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ అంతర్గతంగా ఇలాంటి వారిని ప్రోత్సహిస్తున్నాయని మండిపడ్డారు.

నేడు అభివృద్ధి పనులకు భూమి పూజ

శింగనమల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలంకరాయనిపేట గ్రామానికి శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు బుధవారం రానున్నట్లు ఎంపీడీఓ భాస్కర్, టీడీపీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ మంగళవారం తెలిపారు. మండలంలోని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సొంత గ్రామంలో రూ.60 లక్షలతో సీసీ రోడ్లు, పలు అభివృద్ధి పనులకు భూమి పూ జలు చేస్తారని వివరించారు.

ఉద్యోగోన్నతులు కల్పించాలి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సీనియార్టీ జాబితా ప్రకటించి అర్హత ఆధారంగా ఉద్యోగోన్నతులు కల్పించాలని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సుధాకర్, లక్ష్మీనారాయణ, మల్లికార్జున, చంద్ర, వరప్రసాద్, రామకృష్ణ, మల్లన్న, లక్ష్మీకాంత్, శ్రీనాథ్, నాగిరెడ్డి, రమేష్, గురుబ్రహ్మ, అనంతరం కమిషనర్ బాలస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు.

కలెక్టర్‌ను కలిసిన టీడీపీ నాయకులు

అనంతపురం రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నూతన కలెక్టర్ ఆనంద్‌ను మండల టీడీపీ నాయకులు కలిశారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలసి నాయకులు వేణుగోపాల్, పాముదాయి రఘు, శ్రీనివాసులు, దగ్గుపాటి శ్రీనివాసులు కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం

అనంతపురం టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణం కోసం శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో మంగళవారం వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులతో ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వాముల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అలంకరణలు చేసి వేదమంత్రోచ్ఛారణల నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. మూలవిరాట్‌లకు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, ఉపాధ్యక్షుడు రత్నగిరి దేవరాజ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు డబ్బు ఆదా

సూపర్ జీఎస్టీ, సూపర్ సేవ్ ర్యాలీలో పరిటాల సునీత


రాప్తాడులో జీఎస్టీపై ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు డబ్బు ఆదా అవుతోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. మంగళవారం రాప్తాడు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవ్ కార్యక్రమంకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాల్మీకి జయంతి సందర్భంగా రాప్తాడులోని వాల్మీకి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో నిర్వహించి సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రభుత్వానికి భారం అయినప్పటికీ ప్రజల కోసం తగ్గించారన్నారు. దీని వలన అన్ని వర్గాల ప్రజలకు డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. విద్యార్థి దశ నుంచే ప్రభుత్వం చేసే కార్యక్రమాల గురించి తెలుసుకోవాలన్నారు. జీఎస్టీపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎమ్మెల్యే సొంత ఖర్చులతో నోటు పుస్తకాలు అందచేశారు. పాఠశాల ఆవరణంలో రూ. 80 లక్షలతో నిర్మించిన గ్రంథాలయంను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పాఠశాల వద్ద నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, ఎంఈఓ మల్లికార్జున, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ విజయకుమారి, సర్పంచ్ తిరుపాలు, కన్వీనర్ కొండప్ప, నాయకులు శ్రీనివాసులు, గోపాల్, రమణ, జయరాముడు, కిష్టా, బీరన్న, నారాయణస్వామి, వెంకట్రాముడు, రాజశేఖర్‌రెడ్డి, రాజు, నారాయణస్వామి, రాము, అనిల్ పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి రాప్తాడు సమస్యలు

● అనంతపురం క్రైం: రాప్తాడు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే పరిటాల సునీత అనంతపురం కలెక్టర్ ఆనంద్ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలెక్టర్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. నియోజవకర్గంలోని పెండింగ్ పనులను, రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు మండలాల్లోని సమస్యలను వివరించారు.

పనిగంటల పెంపును ఉపసంహరించుకోవాలి

అనంతపురం టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పనిగంటలు పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పనిగంటలు పెంచుతూ అసెంబ్లీలో తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ, ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలురైతు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ... కార్మికులకు తక్కువ జీతాలు చెల్లించి, ఎక్కువ పని చేయించుకోవాలని చూడడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, నాగభూషణం, వెంకటనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు, కృష్ణమూర్తి, బాలరంగయ్య, శ్రీనివాసులు, ఆజాం బాషా, ఆది, స్వాతి, ఎర్రిస్వామి, లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

అర్బన్ గృహ లబ్ధిదారులకు అదనపు లబ్ధి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): అర్బన్ గృహ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తెలిపారు. మంగళవారం కౌన్సిల్‌హాల్‌లో అర్బన్ హౌసింగ్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అర్బన్ హౌసింగ్ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు లబ్ధి చేకూర్చేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.70వేలు అదనపు సాయం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏఎంసీ ఎస్ఈ రాజశేఖర్, హౌసింగ్ డీఈ శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కురుగుంటలో ఏపీ ఎన్జీఓ సభ్యత్వ నమోదు

అనంతపురం రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏపీ ఎన్జీఓ నగర శాఖ అధ్యక్ష కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, జిల్లా అధ్యక్షకార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రమోహన్, మహిళా విభాగం చైర్‌పర్సన్ జమీలబేగం, శోభారాణి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారం చేయగలిగే సత్తా ఏపీ ఎన్జీఓకే ఉందన్నారు.



మంత్రి కేశవ్‌కు సన్మానం

ఉరవకొండ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కొట్టాలపల్లి ఎత్తిపోతల పథకానికి మంత్రి మండలి ఆమోదం తెలపడంలో కీలక పాత్ర పోషించిన ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను స్థానిక టీడీపీ కార్యాలయంలో రైతులు, పార్టీ నాయకులు మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవినేని పురుషోత్తం, గొర్తి శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ రవీంద్ర, తమ్మినేని లోకేష్, లక్ష్మీనారాయణ, మోహన్, రామకృష్ణ, రామప్ప పాల్గొన్నారు.

● ప్రజాదర్బార్ :ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని మంత్రి కేశవ్ అధికారులకు సూచించారు. ఉరవకొండలోని టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రజలు నుంచి అర్జీలను స్వీకరించారు.

సీజేఐపై దాడికి యత్నించిన వ్యక్తిని శిక్షించాలి

గుంతకల్లు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది దాడికి యత్నించడంపై సీపీఐ నాయకులు స్థానిక మెయిన్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బీ గోవిందు, వీరభద్రస్వామి, మహేశ్, గోపీనాథ్, మహమ్మద్ గౌస్, రాయల్ రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ


సుంకన్నను పరామర్శిస్తున్న పయ్యావుల శ్రీనివాసులు

కూడేరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చోళసముద్రం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కురుబ సుంకన్న ఇటీవల ఆపరేషన్ చేయించుకున్నారు. ఇంటి వద్ద విశ్రాంతి తీసుకొంటున్న ఆయన్ను టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మాజీ ఎంపీపీ బ్రహ్మయ్య, నాయకులు మురళి, కుసాల నాగరాజు, వడ్డేరాజు, కేశన్న, చంద్రబాబునాయుడు, వన్నూరప్ప, పరందామ, వెంకటనాయుడు, డీల్లర్ రాజేష్. డీల్లర్ ప్రసాద్. నటరాజ్, ప్రకాష్, అక్కులప్ప, లక్ష్మన్న ఉన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

పెద్దవడుగూరు, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి సమీపంలో నిర్మించిన శ్రీ వీరభద్రస్వామి ఆలయాన్ని మంగళవారం ప్రారంభించారు. మహిళలు కలశాలతో ఊరేగింపుగా వెళ్లి.. స్వామి వారిని అభిషేకించారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

గుత్తిరూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వాల్మీకి జయంతి సందర్భంగా మండలంలోని తొండపాడులో మంగళవారం నిర్వహించిన కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఇందులో 54 టీములు పాల్గొన్నాయి. మొదటి బహుమతి సాధించిన నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన టీంకు రూ. 25 వేలు, రెండవ బహుమతి సాధించిన గుంతకల్లు మండలం కదిరిపల్లికి చెందిన టీం రూ. 15 వేలు అందజేశారు. కార్యక్రమంలో గుంతకల్లు ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీరంగయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రతాప్, ఆసుపత్రి కమిటీ సభ్యుడు చికెన్ శీనా, సింగల్ విండో అధ్యక్షుడు శివశంకర్, టీడీపీ నాయకులు చిన్నరెడ్డి యాదవ్, రంగస్వామిరెడ్డియాదవ్, సర్పంచు లింగమయ్య ఓంప్రకాష్, రామాంజునేయులు, ప్రకాష్ పాల్గొన్నారు.



గుంతకల్లు: పూజలో పాల్గొన్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, ఉరవకొండ: వేడుకలో పాల్గొన్న మంత్రి కేశవ్

ఘనంగా వాల్మీకి జయంతి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: గుంతకల్లు, తాడిపత్రి, ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో వాల్మీకి మహర్షి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి విగ్రహాలకు, చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. ఉరవకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంత్రి పయ్యావుల కేశవ్, రాయదుర్గంలో విప్ కాలవ శ్రీనివాసులు, గుంతకల్లులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జితేంద్ర గౌడ్, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, తాడిపత్రిలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి వాల్మీకికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వజ్రకరూరు, విడపనకల్లు, బొమ్మనహాళ్, కుందుర్పి, పామిడి, కూడేరు, బెళుగుప్ప, గుత్తి, గుమ్మఘట్ట, కణేకల్లు, యల్లనూరు మండల కేంద్రాల్లోనూ టీడీపీ నాయకులు, అధికారులు వాల్మీకి మహర్షికి పూజలు నిర్వహించారు.

జెండా కట్ట సమస్య పరిష్కరించాలని ధర్నా

గుత్తి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీపీఐ కాలనీలో దస్తగిరి స్వామి జెండా కట్టకు అడ్డంగా ఓ కుటుంబం నిర్మించిన గోడను తొలగించాలని ఆ కాలనీవాసులు మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేశారు. సమస్యపై నాలుగేళ్లుగా మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదని మండిపడ్డారు. త్వరలో గ్యార్మీ పండుగ ఉందని, ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కమిషనర్ జబ్బర్‌మీయా తో వాగ్వివాదం దిగారు. పోలీసులు వారికి నచ్చచెప్పి అక్కడి నుంచి పంపించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ పుణ్యవతికి వినతి పత్రం అందజేశారు.

కేబుల్ చోరీ

యాడికి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకు చెందిన గోపాల్‌కు డైవాలమడుగు వద్ద అరటి తోట ఉంది. అందులోని సుమారు రూ.30 వేల విలువ చేసే కేబుల్‌ను దుండగులు సోమవారం రాత్రి ఎత్తుకెళ్లారు. గత నెల 24న ఇదే తోటలో దొంగలు కేబుల్ చోరీ చేశారని, 15 రోజుల వ్యవధిలో మళ్లీ చోరీ జరిగిందని బాధిత రైతు గోపాల్ వాపోయాడు. పోలీసులకు సమాచారం అందించినా స్పందించడం లేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

బెళుగుప్ప, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదివర్తి గ్రామ సమీపంలో సోమవారం రాత్రి నిర్మాణదశలో ఉన్న కల్వర్టును లారీ ఢీకొనడంతో డ్రైవర్ శంకర్ (40) మరణించాడు. బూదివర్తికి చెందిన శంకర్ కళ్యాణదుర్గానికి లారీలో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. గ్రామస్థులు అతన్ని కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించగా... అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. శంకర్‌కు భార్య సునీత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్ఐ శివ తెలిపారు.

మందు కలిపిన నీరు తాగి మేకలు ...

పుట్లూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండుగారికుంట గ్రామానికి చెందిన రాజశేఖర్, బయన్నకు చెందిన 20 మేకలు క్రిమిసంహారక మందు తాగి మంగళవారం మరణించాయి. అరటితోట పంటకు డ్రిప్పుద్వారా క్రిమిసంహారక మందును కొట్టడానికి డ్రమ్ముల్లో సిద్ధంగా ఉంచిన నీటిని ఆ మేకలు తాగాయి. 20 మేకలు మరణించడంతో తమకు రూ.2.60లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.

మరణానికి మద్యం కారణం కాదు

గుంతకల్లు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని హనుమాన్ సర్కిల్ వద్ద ఉన్న మద్యం షాపు వద్ద ఆదివారం మద్యం సేవించిన పెద్దన్న ఒక్కసారిగా మరణించిన విషయం తెల్సిందే. మద్యం కల్తీ కావడంతో అతను మరణించాడా అనే అనుమానంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సహాయ సూపరింటెండెంట్ ఎస్ రేవతి ఆ షాపుతో పాటు పలు దుకాణాల్లోని మద్యం శాంపిళ్లను మంగళవారం సేకరించి పరీక్షలకు పంపారు. మద్యం కల్తీ లేదని, అనారోగ్య కారణాలతోనే ఆ వ్యక్తి మరణించాడని రిపోర్టు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ శివసాగర్ తెలిపారు.

ఎమ్మెల్యే హామీపై హర్షం

గుంతకల్లు టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఇతర కులస్థులు, కార్పొరేట్ సంస్థలు నాయీబ్రాహ్మణ సంఘం అనుమతితోనే సెలూను షాపులు పెట్టాలని, లేకుంటే వాటిని వెనక్కుపంపిస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తమకు హామీ ఇచ్చినట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. దీనిపై వారు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి వేణుగోపాల్, ఉపాధ్యక్షులు మాణిక్యం, ప్రమేష్‌బాబు, గోవిందరాజులు, సహాయకార్యదర్శులు రవికుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, జయరాం, విద్యాకమిటీ చైర్మన్ నాగరాజు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం


పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న వైద్యులు

పామిడి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో పారిశుధ్య కార్మికులను సీహెచ్‌సీ డెవలప్‌మెంట్ కమిటీ మెంబర్ చిలకల రాజగోపాల్, సీహెచ్‌సీ వైద్యాధికారి శివకార్తీక్ రెడ్డి, సీహెచ్‌సీ స్వచ్ఛ ఆంధ్ర అధికారి కమలాదర్ మంగళవారం ఘనంగా సన్మానించారు. సీహెచ్‌సీకి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు రావడంలో ఈ కార్మికుల కృషి చాలా ఉందని కొనియాడారు.

ఈ క్రాప్ బుకింగ్ గడువు పొడిగింపు

రాయదుర్గంరూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఈక్రాప్ బుకింగ్‌కు ఈ నెల 20 వరకు ప్రభుత్వం గడువు పొడిగించినట్లు ఏఓ అహ్మద్‌బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 52 వేల ఎకరాల్లో పంటలు సాగుచేయగా ఇప్పటివరకు 30,100 ఎకరాల్లో ఈ పంట నమోదు చేసినట్లు వివరించారు.

త్వరలో అమ్మలదిన్నెకు చాగల్లు నీరు

పెద్దపప్పూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): చాగల్లు రిజర్వాయర్ నుంచి త్వరలో అమ్మలదిన్నె జీపకట్ కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తామని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని అమ్మలదిన్నెలో మంగళవారం నిర్వహించిన గ్రామసభ లో ఆయన మాట్లాడారు. ముచ్చుకోట రిజర్వాయర్‌కు నీరిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. కాగా, గ్రామంలో సిమెంట్‌రోడ్లు, మురికినీటి కాలువలకు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరారు.

ఉపాధి పథకం వరంలాంటిది : ఏపీఓ


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ పోలేరయ్య

కూడేరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు, రైతులకు వరంలాంటిదని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి అభివర్ణించారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయంలో 2026-2027 సంవత్సరం కింద పనుల గుర్తింపు ప్రణాళికపై నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఉపాధి పథకం కింద పండ్లతోటల పెంపకం, వర్షం నీటిని నిల్వ చేసే పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సమావేశంలో స్థానిక సర్పంచు లలితమ్మ, పంచాయితీ కార్యదర్శి రమాదేవి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మృతుడి వివరాలు లభ్యం

గుత్తి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గుత్తి రైల్వే జీఆర్పీ పరిధిలోని తురకపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ఆచూకీ లభించినట్లు జీఆర్పీ పోలీసులు మంగళవారం తెలిపారు. మృతుడిని పట్టణంలోని బండగేరికి చెందిన చాకలి సుబ్రహ్మణ్యం (36)గా గుర్తించామన్నారు. కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకున్నారని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.



